క్లుప్తంగా

నేడు వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ పోస్టుల భర్తీకి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు కమిషనర్ చాంబర్‌లో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలు తీసుకుని రావాలన్నారు.

రూ.10.43 కోట్లతో అభివృద్ధి పనులు



కలుగోడులో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు, నేత్రపల్లి, బేలోడు, భూపసముద్రం, పూలకుంట, గుమ్మఘట్ట గ్రామాల్లో రూ.10.43 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఉపాధి ఏపీఓ సురేష్ తెలిపారు. సోమవారం ఆయా గ్రామాల సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. 2024–25 సంవత్సరానికి ఉపాధిహామీ పథకం కింద 112 పనులకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు కవిత, వినూత, కోట్ల ఉమేష్ రెడ్డి, రాధమ్మ, విజయలక్ష్మి, అనిల్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు మల్లికార్జున, కృపాల్, దేవమ్మ, నర్సమ్మ, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సాకే జయరాం సేవలు చిరస్మరణీయం



కామర్స్ లెక్చరర్ జయరాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

కళ్యాణదుర్గం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా పని చేసిన సాకే జయరాం సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో సోమవారం సాకే జయరాం సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా వినియోగదారుల సంఘం నాయకుడు చల్లా కిశోర్, విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి తిప్పేస్వామి మాట్లాడారు. కళ్యాణదుర్గం ప్రాంతంలో ఎంతోమంది యువతీ యువకులకు జయరాం మార్గదర్శకులుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో విశ్రాంత లెక్చరర్ మల్లికార్జున, జర్నలిస్టు లింగప్రసాద్, ఉపాధ్యాయులు విజయ్‌కృష్ణ, స్ఫూర్తి నరసింహులు, ఓబుళరాజు, రోజ్లీ రాజేష్, బీఎస్ఎన్ఎల్ నారాయణ, ఎండోమెంట్ ఈఓ రమేష్, లాయర్ పరిపూర్ణ, జయరాం సతీమణి సరస్వతి పాల్గొన్నారు.

వైద్య చికిత్సకు ఆర్థికసాయం



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బ్రహ్మసముద్రం: పాలవెంకటాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు హరిజన లింగప్ప కుమారుడు బాబు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి అనంతపురంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు పాలబండ్ల చంద్రశేకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహులు, నాగభూషణ, శివన్న , రామన్న, ధనుంజయ, శివన్న, ప్రశాంత్, నటరాజ్, అయ్యన్న, లక్ష్మీ ప్రసాద్ తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వైద్య చికిత్సల కోసం తమవంతుగా రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. పార్టీ తరఫున కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

ఘనంగా వరల్డ్ సిటిజన్ డే



ఓటర్లను సన్మానిస్తున్న ఆర్డీఓ నిశాంత్ రెడ్డి

కళ్యాణదుర్గం: కలెక్టర్ గౌతమి, ఎన్నికల అధికారుల ఆదేశాలతో స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం వరల్డ్ సిటిజన్ డే నిర్వహించారు. రెవెన్యూ డివిజన్ పరిధిలోని 80 ఏళ్ల పైబడిన సీనియర్ సిటిజన్ ఓటర్లు వైకే హరికృష్ణ, మాల ఎర్రిస్వామిని ఆర్డీఓ నిశాంత్ రెడ్డి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫణికుమార్, ఎన్నికల డీటీ వెంకటేశులు, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

గంధం ఊరేగింపు

విడపనకల్లు: మండల పరిధిలోని వి.కొత్తకోట గ్రామంలో హజరత్ బడేషా వలీ ఖాద్రీ ఉరుసులో భాగంగా సోమవారం గంధం వేడుకలను ఘనంగా నిర్వహించారు. గంధాన్ని దాసునూర్‌చిన్న రామిరెడ్డి ఇంటి నుంచి దర్గా వరకూ ఊరేగించారు. అనంతరం చక్కెర చదివింపులు చేయించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

గాంధీజీకి ఘన నివాళి

కళ్యాణదుర్గం: జాతిపిత మహాత్మగాంధీ ఆశయాలను కొనసాగిద్దామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. సోమవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నేటి యువత గాంధీ చూపించిన మార్గాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గాంధీజీ బాటలోనే సీఎం వైఎస్ జగన్ నడుస్తున్నారన్నారు. గ్రామాల్లో గ్రామ స్వరాజ్య స్థాపనకు కృషి చేస్తున్నారని తెలిపారు. గాంధీ చౌక్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఎల్ఐసీ ఏజెంట్ల యూనియన్ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. దుర్గం రక్తదాతల సంఖ్య ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, కో ఆప్షన్ అఫ్జల్, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పాలాక్షి, జెడ్పీటీసీ రాధాస్వామి, కలేకుర్తి జయరామిరెడ్డి, కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, విరుపాక్షి, మంజుల, ఎంపీపీ మారుతమ్మ, పాల్గొన్నారు.

శెట్టూరు: చిన్నంపల్లిలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురామరావు, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ యువరాజ్, పెరుగుపాళ్యం సచివాలయంలో జేఏసీ కన్వీనర్ తిమ్మరాజు, అయ్యగార్లపల్లిలో జెడ్పీటీసీ మంజునాథ తదితరులు గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు.

కంబదూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం, సచివాలయం–1లో గాంధీ జయంతి జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, జిల్లా కమిటీ సభ్యుడు నీలి శంకరప్ప, మండల కన్వీనర్ బాలరాజు యాదవ్, ఎంపీటీసీలు మీసేవ కుమార్, మల్లేష్ పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం/కుందుర్పి: మహాత్మాగాంధీ జయంతిని బ్రహ్మసముద్రం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఏడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రామాంజినేయులు, వీరశైవ లింగాయత్ డైరెక్టర్ ప్రసాద్ రెడ్డి, మండల రైతు సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి ఎంపీపీ చంద్రశేకర్ రెడ్డి పాల్గొన్నారు. కుందుర్పి మండలంలో ఎస్కే చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ రాధాస్వామి, మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, కో–ఆప్షన్ సభ్యుడు ముజీవుల్లా, లెనిన్ బాబు పాల్గొన్నారు.

ఉరవకొండ: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం, మేజర్ పంచాయతీ, ఎంపీడీఓ కార్యాలయం, లయన్స్ క్లబ్‌లో గాంధీ జయంతి నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ జోనల్ చైర్మన్ ప్రణయ్ రెడ్డి, సర్పంచ్ లలితమ్మ, ఎంపీపీ చందాచంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, ఎంపీడీఓ అమృతరాజ్, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, నాయకులు తేజోనాథ్, అశోక్, బసన్న, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జయచంద్ర పాల్గొన్నారు.

గుమ్మఘట్ట/రాయదుర్గం/కణేకల్లు/బొమ్మనహాళ్: నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సోమవారం గాంధీ జయంతి పురస్కరించుకుని మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కేటీఎస్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రఘురామమూర్తి జాతిపిత చిత్రపటానికి నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. కణేకల్లు మండలం కె.మారెంపల్లిలో గాంధీ జయంతి నిర్వహించారు. వైస్ ఎంపీపీ సుజాత, కణేకల్లు సర్పంచ్ నిర్మల, వైస్ ఎంపీపీ, సర్పంచు తదితరులు పాల్గొన్నారు. బొమ్మనహాళ్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సచివాలయల్లో గాంధీ జయంతిని జరుపుకున్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీలక్ష్మి, మల్లేశ్వరి పాల్గొన్నారు.

కూడేరు/విడపనకల్లు/బెళుగుప్ప/వజ్రకరూరు: కూడేరు మండలం కరుట్లపల్లి, తహసీల్దార్ కార్యాలయాల్లో గాంధీజీ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో సోషల్ వెల్ఫేర్ రాష్ట్ర డైరెక్టర్ నిర్మలమ్మ, సర్పంచ్ ఓబుళమ్మ, ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు జయచంద్ర నాయుడు, తహసీల్దార్ శేషారెడ్డి పాల్గొన్నారు. విడపనకల్లు మండలం గడేకల్లు పంచాయతీ కార్యాలయంలో ఎంపీపీ పుష్పావతి ఆధ్వర్యంలో గాంధీ జయంతి జరిగింది. బెళుగుప్ప పీహెచ్‌సీలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. వజ్రకరూరు మండల వ్యాప్తంగా గాంధీ జయంతి జరుపుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మోనాలిసా, అధికారులు పాల్గొన్నారు.



కళ్యాణదుర్గంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



కణేకల్లులో గాంధీజీ చిత్రపటానికి శ్రద్ధాంజలి



బ్రహ్మసముద్రంలో గాంధీ చిత్రపటానికి నివాళి



ఉరవకొండలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ యువనేత ప్రణయ్



బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ ఆరోగ్య ఉపకేంద్రంలో..



శెట్టూరు మండలం అయ్యగార్లపల్లిలో..



కుందుర్పిలో వైఎస్సార్‌సీపీ నాయకుల నివాళి



కంబదూరులో..



గుమ్మఘట్ట మండలం నేత్రపల్లి గ్రామంలో..



కూడేరు మండలంలో..



వజ్రకరూరులోని మెయిన్ బజార్‌లో..



విడపనకల్లు మండలం గడేకల్లులో..



బెళుగుప్ప మండలం రమనేపల్లి సచివాలయంలో..

గుంతకల్లు–చిక్‌జాజూర్ రైలు సేవల నిలిపివేత

రాయదుర్గంటౌన్: గుంతకల్లు నుంచి చిక్‌జాజూర్‌కు (రాయదుర్గం మీదుగా) నడిచే స్పెషల్ ప్యాసింజర్ రైలు(07585/07586) రాకపోకలను 18 రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు సౌత్‌వెస్టర్న్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ రైలు రాకపోకలు ఉండవని పేర్కొన్నారు. రాయదుర్గం–సోమలాపురం రైల్వేస్టేషన్ల మధ్య ఇంజినీరింగ్ సంబంధిత మరమ్మతుల నేపథ్యంలో రైలు సేవలను నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

రేపు ప్రత్యేక స్పందన

విడపనకల్లు: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఈనెల 4వ తేదీన కలెక్టర్ గౌతమి ఆధ్వర్యంలో ప్రత్యేక స్పందన కార్యక్రమం ఉంటుందని సీనియర్ అసిస్టెంట్ వన్నప్ప సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ సమస్యలపై అర్జీలు స్వీకరిస్తారన్నారు.

కార్మికుల సేవలు అమూల్యం



కార్మికులను సత్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఉరవకొండ: ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ లలితమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ చంద్రమ్మ, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప, ఎంపీడీఓ అమృతరాజ్, ఈఓ గౌస్‌సాహెబ్ తదితరులు 25 మంది స్వచ్ఛ భారత్ కార్మికులను సత్కరించారు. క్లాక్‌టవర్ ప్రాంతంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా పశువులను తరలించాలని వార్డు సభ్యుడు నిరంజన్‌గౌడ్ కోరారు. వెంటనే చర్యలు తీసుకుంటామని ఈఓ తెలిపారు. స్పందిస్తూ పశువులను తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కోర్టు కేసులో ఉన్న ఇంటి పట్టాల లబ్ధిదారులకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపాలని కోరారు.

కంటి వైద్య శిబిరం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని జామియా మహమ్మదీయ అరబిక్ కళాశాలలో సోమవారం జరిగిన ఉచిత కంటి వైద్య పరీక్ష శిబిరానికి స్పందన లభించింది. బళ్లారి ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల, జమీయత్ అహ్లె అదీస్ కమిటీ ఆధ్వర్యంలో 400 మందికిపైగా కంటి పరీక్షలు చేశారు. వీరిలో కంటి శుక్లాల ఆపరేషన్లకు 150 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో జమీయత్ అహ్లె అదీస్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అమీన్ కమిటీ ట్రెజరర్ నజీర్, మసూద్, ఖాజీ అతావుర్ రెహమాన్, అష్రఫ్ ఫైజీ, అజీమ్ మాలీసాబ్ పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలు



పార్టీలో చేరిన వారితో కలసి నినాదాలు చేస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

- రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలో కార్యకర్తలకు అండగా ఉంటామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ స్పష్టం చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం కుందుర్పి మండలం ఎనుములదొడ్డి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలను వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. తమపై నమ్మకంతో పార్టీలోకి వచ్చిన వారందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఎనుముల దొడ్డిలో బీటీపీ ప్రాజెక్టుకు భూములు కోల్పోయిన రైతులందరికీ పరిహారం అందిందన్నారు. రావాల్సిన వారికి కూడా ఈ నెలాఖరు లోపు పరిహారం మొత్తం అందుతుందని ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాబోవు రోజుల్లో బీటీపీ ప్రాజెక్టును పూర్తి చేసి రైతుల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే తన చిరకాల ఆకాంక్ష అని వెల్లడించారు. అనంతరం ఎనుములదొడ్డి గ్రామ పంచాయతీలోని రుద్రంపల్లి, ఎనుములదొడ్డి, బోదపల్లి, యస్.మల్లాపురం గ్రామాలకు సంబంధించి 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు టీడీపీ కార్యకర్తలు తెలిపారు. తాము రాజకీయాలు చేయమని, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కిందన్నారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పాలాక్షి, కుందుర్పి జెడ్పీటీసీ రాధాస్వామి, మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, జేసీఎస్ కన్వీనర్ రాము, నాయకులు నాగరాజు, ఎనుములదొడ్డి సర్పంచ్ విజయ్‌కుమార్, నాయకులు లక్ష్మీకాంత్, బొమ్మలింగ, ఆంజనేయులు, ఖాసీంసాబ్, తిప్పేస్వామి, నరసింహప్ప, ఉలిగప్ప, భాస్కరప్ప పాల్గొన్నారు.

యుగపురుషుడు మహాత్మా గాంధీ

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి, చిత్రంలో ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: అహింసా మార్గాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహానుభావుడు గాంధీజీ అని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కొనియాడారు. సోమవారం పట్టణంలోని పాత టవర్ క్లాక్ వద్ద ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, రెడ్‌క్రాస్ సంస్థ చైర్‌పర్సన్ కాపు భారతితో కలసి ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం కోసం సత్యం, అహింసతో గాంధీజీ పోరాడారన్నారు. గాంధీజీ ఆశయాలు, విలువలు సమాజానికి ఎంతో అవసరమని గుర్తు చేశారు. రూ.3.60 లక్షల వ్యయంతో విగ్రహాన్ని అందించిన గోనబావి శ్రీనివాసులును అభినందించారు. ఈ సందర్భంగా పాత టవర్‌క్లాక్ ఏరియాను గాంధీ సర్కిల్‌గా నామకరణం చేస్తూ మున్సిపల్ సమావేశంలోనూ ఆమోదించాలని చైర్‌పర్సన్, కమిషనర్‌కు సూచించారు. గాంధీ చూపిన మార్గంలోనే ప్రతి ఒక్కరు నడవాలని ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి అన్నారు. గాంధీజీ ఆచరణలోనే సీఎం జగన్ గ్రామ స్వరాజ్యానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు జయంతి సుబ్రహ్మణ్యం, జయంతి విష్ణుతేజ, జయంతి సురేష్, కో–ఆప్షన్ సభ్యుడు శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మెన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, పట్టణ కన్వీనర్ అరవ శివప్ప, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి, కమిషనర్ దివాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విప్ కాపు మాట్లాడుతూ.. అహింసను వీడి సత్యమార్గాన్ని అన్వేషించాలన్నదే జాతిపిత సిద్ధాంతమన్నారు. టీడీపీ నాయకులు జాతిపిత ఆశయాలకు తూట్లు పొడిచేలా వ్యవహరిస్తున్నారని విరుచుకుపడ్డారు. సచివాలయాలు, వాటిలోని సిబ్బంది, వలంటీర్లను తొలగించాలంటూ టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన పుత్రుడు, దత్తపుత్రుడు చేస్తున్న వ్యాఖ్యలు దుర్మార్గమన్నారు. తెలుగుదొంగలకు గాంధీ జయంతి జరుపుకునే అధికారం లేదన్నారు. రాయదుర్గంలో రెండు రోజుల క్రితం వైరల్ అయిన ఓ వీడియోను అందరు చూస్తున్నారన్నారు. అందులో ఒకడు నాలుక కోస్తాం.. ఇంకొకడు గొడ్డలి తీసుకొస్తాం అంటూ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. గాంధీజీ సిద్ధాంతాలకు విరుద్ధంగా చేస్తున్న ఈ వ్యాఖ్యలను గమనించాలన్నారు. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసుల తొత్తులు కొందరు దిగజారి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. అట్టడుగు వర్గాలకు సమానత్వం కావాలని గాంధీజీ కోరుకుంటే దళితుల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా తమ్ముళ్లు అంటూ అవహేళన చేసిన దుర్మార్గుడు చంద్రబాబు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలు తోకలు కత్తిరిస్తాం.. బీసీలు జడ్జీలు అయ్యేందుకు అర్హులు కాదు.. యోగ్యత లేదంటూ రాసి పంపిన దౌర్భాగ్యుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. చంద్రబాబు చెప్పినన్ని అబద్ధాలు దేశంలో మరెవ్వరూ చెప్పి ఉండబోరని స్పష్టం చేశారు. దురాశకు వెళ్లి రూ.కోట్ల ప్రజాసొమ్ము దోపిడీ చేసి జైలు పాలయ్యారన్నారు. అతడి తొత్తుగా ఉన్న కాలవ శ్రీనివాసులుకు గాంధీ జయంతి జరుపుకునే అర్హత లేదన్నారు. అంతకు ముందు స్థానిక మోడల్‌స్కూల్, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవలో భాగంగా చైర్‌పర్సన్ కాపు భారతితో కలసి చీపురుపట్టి చెత్తను ఊడ్చారు. కార్యక్రమాల్లో వైస్ చైర్మెన్లు శ్రీనివాస్ యాదవ్, వలీబాష, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ శ్రీనివాసులు, పట్టణ కన్వీనర్ అరవ శివప్ప, జెడ్పీటీసీ మహేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, జిల్లా కార్యదర్శి రిబ్కా పాల్గొన్నారు.



మోడల్ స్కూల్‌లో పరిసరాలను శుభ్రం చేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి, తదితరులు

కర్ణాటక మద్యం పట్టివేత



మద్యం ప్యాకెట్లను చూపుతున్న సెబ్ పోలీసులు

రాయదుర్గం: సెబ్ పోలీసులు సోమవారం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మెరుపుదాడులు నిర్వహించారు. డి హీరేహాళ్ మండలంలోని కల్లాం, గుమ్మఘట్ట మండలం బేలోడులో 136 కర్ణాటక టెట్రా పాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మారెన్న, లాలయ్య అనే ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు సెబ్ సీఐ జయనాథ్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కర్ణాటక మద్యం అమ్మినా, తరలించినా కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ హరికృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ సోమశేఖర్, సిబ్బంది శివయ్య, ఇమ్రాన్, తిమ్మన్న, జ్యోతి పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో రోగాల నివారణ



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుధాకర్

కూడేరు: ముందస్తు జాగ్రత్తలతో పశువులకు రోగాలు రాకుండా నివారించవచ్చని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్య నిర్వాహణాధికారి (డీఎల్‌డీఏ ఈఓ) డాక్టర్ సుధాకర్ అన్నారు. సోమవారం ముద్దలాపురంలో ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన పథకం కింద వాటర్ షెడ్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సుధాకర్ పశువులకు వైద్య పరీక్షలు చేసి, మందులు, దాణా అందజేశారు. దాణా అందిస్తే పాల దిగుబడి పెరుగుతుందన్నారు. ఆడ దూడలు పుట్టేందుకు ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వాటర్ షెడ్ ఏపీడీ సుధాకర్ రెడ్డి, పీఓ ఈశ్వరయ్య, టీఓ విశ్వనాథ్‌రెడ్డి, మండల పశు వైద్యాధికారి శ్రీనివాసులు, ఏహెచ్ఏ సుభహాన్, గోపాలమిత్ర రాఘవ పాల్గొన్నారు.

రేషన్ షాపులపై అధికారుల దాడి

బెళుగుప్ప: మండల కేంద్రంలోని రేషన్‌షాపులపై తూనికలు కొలతల అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. లీగల్ మెట్రాలజీ గుంతకల్లు డివిజన్ ఇన్‌స్పెక్టర్ శంకర్ సిబ్బందితో కలసి బెళుగుప్పలోని ఎండీయూ వాహనంలో తూకాలను పరిశీలించారు. డబ్బాలను వినియోగిస్తూ రేషన్ పంపిణీ చేయడంతో సుమారు మూడు కిలోల వరకూ తక్కువ రావడంపై సంబంధిత రేషన్ షాపు నంబర్–2ను పరిశీలించారు. త్రాసుకు సీల్ వేసి ఉన్న గడువు అయిపోవడంతో త్రాసు, ఎండీయూ వాహనంలోని డబ్బాలను సీజ్ చేశారు. తూకాలు తక్కువ వేస్తుండటంపై లీగల్ మెట్రాలజీ చట్టం మేరకు కేసు నమోదు చేసామని డివిజన్ ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

కేఎస్‌సీసీ చర్చి వార్షికోత్సవం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీలోని కింగ్ ఆఫ్ షాలేమ్ క్రైస్ట్ చర్చి వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. చర్చి పాస్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో రాయచూరు నుంచి విచ్చేసిన ఉపన్యాసకులు, పాస్టర్ శ్యామ్యుల్ బైబిల్ సందేశాలను బోధించారు. క్రైస్తవ్యం మతము కాదురా అనే సందేశాత్మకమైన క్రైస్తవ గీతం ప్రోమోను విడుదల చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు వీరేష్, డేవిడ్, థామస్, సతీష్ డానియల్, సువార్త గాయకుడు హరి పాల్గొన్నారు.

108 డ్రైవర్‌కు సన్మానం

కూడేరు: చోళసముద్రం సచివాలయంలో సోమవారం 108 వాహనం డ్రైవర్ కృష్ణమూర్తిని పంచాయతీ తరుపున సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, సర్పంచ్ రమాదేవి మాట్లాడుతూ.. డ్యూటీ లేని రోజుల్లో కృష్ణమూర్తి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి రోడ్లకు మట్టి వేసి మరమ్మతులు చేయడం హర్షణీయమన్నారు.